దూర్వాసుల వేంకట సుబ్బారావు.

- కెనడా






ఆరు అడుగుల ఆజానుభాహువు, స్ఫుర(ద్రూపి, దబ్బపండు ఛాయ. బరంపురం పట్టులాంటి జుట్టు. టెన్నీసు ఆడటంలో మంచి దృడకాయులు. తెల్లటి ఖద్దరు లాల్చీ, చేనేత పంచె ధరించి, కండువా వేసుకుని సాయంత్రం 5.30కి జవహర్ క్లబ్‌కి వెళ్ళటం నాన్నకి అలవాటు. రెండు కిలో మీటర్ల త్రోవలో అడపా తడపా ఎవరో ఒకరు వంగి నమస్కరించటం, వారి యోగక్షేమాలడిగి, ఏనాడో నడిపించిన కోర్టు వ్యవహారం 'సవ్యంగానే జరిగింది కదా ,ఏం చికాకులులు లేవు కదా' అని పునశ్చరణ చేయటం ఆయనకు పరిపాటి.



సన్నిహితులు, తోటి న్యాయవాదులకు ఆయన డి.ఎమ్.ఎస్; చాలామందికి ధర్మరాజు. క్లయింట్లు. వాణిజ్యదారులు, క్షత్రియులు ఆయన్ని అన్నయ్య అని పిలుస్తే రైతువారీ బాబుగారని, మేనేజరు శాస్త్రిగారని అనేవారు. మా అన్నదమ్ములకు, అక్కచెల్లెండ్రకు ఏక వచనంలో నువ్వు, నాన్న అన్నది అలవాటు. తండ్రిని గౌరవించటం ప్రపంచం అంతటా, సర్వ జాతుల్లో, సర్వమతాల్లో వ్యాపించి ఉన్నది. మానాన్న ప్రత్యేక గుణాలను స్వకీయమైనా స్వానుభవాలు కావున క్లుప్తంగా వివరిస్తా. ఆయన ప్రాతః స్మరణీయులు. అందుకే ఈ అక్షర నీరాజనాలు.

మోకాలి లోతు నీటిలో రెండు కిలోమీటర్లు నడుచుకుంటూ బడికి చేరేవారట. విద్యాభ్యాసం తుని, రాజమహేంద్రవరము, విజయ నగరంలో. ఏక సంతాగ్రాహి. మహామహులు ఆచార్య మామిడి పూడి వెంకట రంగయ్య, బ్రహ్మజ్యోస్యుల సుబ్రహ్మణ్యం, దేవులపల్లి అప్పల నరసింహంగార్ల పాఠాలు నేర్చేరు. తెలుగు, ఆంగ్ల భాషల్లో చిన్నతనం నుంచే ఉపన్యాసాలు చేయటం, ఎన్నో బహుమతులు అందుకోవటం ఆయనకి ఒక ప్రశంసార్హమైన ప్రజ్ఞ

మద్రాసు విశ్వవిద్యాలయంలో న్యాయవాద పట్టాకి చదువుతున్న రోజుల్లో, గాంధీజీ పిలుపుతో తాత్కాలికంగా చదువు విరమించినా తర్వాత పట్టభద్రులయారు. ఈయన ఆలోచనాశీలి, సంప్రదాయమైనది, సుస్థిరమైనది తల్లితండ్రుల సేవాంకిత భావమేనని తలచి, పట్నాలకి పోకుండా, స్వగ్రామంలోనే న్యాయవాది వృత్తి ప్రారంభించారు. ధర్మరాజు అన్న పేరు ఎందుకు వచ్చిందంటే, తగువు పడుతున్న దాయాదులనందర్నీ పిలిపించి, 'మీలో మీకు ఈ తగాదాలు మంచివికావు. ఏదోవిధంగా మీ స్థిరాస్తులన్నీ, చరాస్తుల్నీ అవసరమైతే విభజించుకుని, న్యాయస్థానం ముఖం చూడకుండా పరిష్కరించమనే' వారు. కోర్టు కెక్కితే ఉండే సాధక బాధకాలు విశ్లేషించి, నీతి నియమాల ప్రకారం మసులుకోమని వారికి నచ్చచెప్పే ధర్మజ్ఞుడు. కాని కొన్ని పెద్ద వాజ్యాల్లో విశాఖ పట్నం, కలకత్తా, అహమ్మదాబాద్, అలహాబాద్ మహా న్యాయ స్థానాల్లో వాగ్వాదం చేసిన విజేత. ఆస్థిపాస్తుల వ్యవహారాలే కాక, బందిపోటు దొంగలను, ఖూనీ దార్లనూ ఎన్నిసార్లో కాపాడారు. అటువంటి వ్యవహారాల్లో రాత్రింబగళ్ళు తన విశాలమైన గ్రంధాలయాన్ని పరిశోధించి, అవసరమైన వాటిని గోనె సంచులకెత్తి న్యాయస్థానాలకు, కలెక్టర్ల వద్దకు తీసుకెళ్ళి,

వాదించి ప్రణతులందుకొన్న న్యాయవాది మా నాన్న. ఆదాయం బాగా ఉన్నా ఖర్చులు కూడ భారీగానే ఉండేవి ఆయన పేరు ప్రఖ్యాతులు వినటమే కాని, ఒక్కసారి న్యాయస్థానానికి వెళ్ళిచూడలేకపోయాం. మా కచ్చేరి చావిడిలో ‘కోర్టు పక్షులు‘ ఎందరో ఉండేవారు 11 గంటల వరకు. ఆదరిదాపులకు పిల్లల్ని రానిచ్చేవారు కారు మా నాన్న. ‘నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉంటుందో, న్యాయస్థానంలో న్యాయం అంతే ఉంటుంది. మీకు తెలియదు - ఈ నల్ల కోటు, తెల్ల పాగా విడిచేరోజు ఎదురుచూస్తున్నా‘ననేవారు మా నాన్న. వయస్సులో, కృపణతలో పెద్ద, మాన్యతగల మహనీయుడు. మా అన్నదమ్ముల నెవ్వరినీ న్యాయశాస్త్రం చదివించలేదు. మా కుటుంబం యావత్తూ ఒకేసారి మా ఊర్లో కోర్టుకి వెళ్ళేం. మా నాన్న న్యాయవాదుల సంఘానికి కార్యదర్శిగా, అధ్యక్షులుగా చేసిన సేవకు ఆయన చిత్తరువును ఆవిష్కరిస్తూ ఆహ్వానిస్తే వెళ్ళేం. మా నాన్న న్యాయశాస్త్ర గ్రంథాలయాన్ని ఆ సంఘానికే బహుకరించేము.

దైనందిన జీవనంలో, తెల్లవారు ఝామున మమ్మల్ని నిద్రలేపి, మరీ చిన్నవాళ్ళచేత చుట్టాలందరిపేర్లు వీలయినన్ని చెప్పించి, భాగవతంలో రెండు పద్యాలు చదివించేవారు. కాస్త పెద్దపిల్లలచేత గజేంద్ర మోక్షము, దాశరథీ శతకం, భర్తృహరి సుభాషితాలు వల్లెవేయించేవారు. పోటీతో చదివే వాళ్ళం. బడిలో ఏ రోజు ఏం జరిగిందో సాయంత్రం అడిగి తెల్సుకునేవారు. వ్యాసరచన పోటీల్లో పాల్గొనమని ప్రోత్సహించేవారు. వినాయకచవితి, సరస్వతీ పూజ తప్పక యావత్ కుటుంబం కలిసి చేయవలసిందే అబద్ధం చెప్పరాదని శాసించేవారు - తరచు వాడే సామెత "నిజము దేముడెరుగు, నీరు పల్లమెరుగు" అన్నది. పుణ్య క్షేత్రాలు, దేవాలయాలు ఆయన చూడలేదు. కారణం ‘ధర్మానికి లొంగి జీవిస్తే, ఆ ధర్మమే మనల్ని రక్షిస్తుంది అనిన్నీ, అన్ని ప్రాణులలోనూ ఉండేది ఆ ఒక్క భగవంతుడే‘ అని మా చిన్నతనంలో చెప్పేవారు. కాలక్రమేణా తెల్సుకున్న విషయం మా నాన్న ఆదిశంకరుల అద్వైతాన్ని, భగవద్గీతని తన మనోవికాసానికి చదువుకున్నారని. నేను విదేశం చదువుపై వెళ్తున్నప్పుడు తాను చెప్పదలచుకున్నది ఈ చిన్ని పుస్తకరూపంలో ఉంది అని భగవద్గీత ఇచ్చారు. పెద్దలన్నా, గురువులన్నా, అతిథులన్నా గౌరవంతో చూచేవారు . మా అందరికీ అదే ఆదేశించేవారు. ‘తెలుగు తరగతిలో ఎవ్వరూ చేరరు, ఆ గురువుగారు ఎక్కువ మార్కులివ్వనందున అని సంస్కృతంలో చేరే‘నని చెప్తే, ఏకాఏకీ హెడ్‌మాష్టరు గారింటికి తీసికెళ్ళి తిరిగి తెలుగు తరగతికి మార్పించారు. మార్కులకన్నా ముఖ్యం మా నాన్న దృష్టిలో గురు ద్రోహం తప్పు అని. ఆ తెలుగు రమణయ్యగారు మా నాన్నకి ఎప్పుడో గురువుగారట! తరచు మహామహులు, సాహితీవేత్తలు కవి కొండల వెంకట్రావు, దివాకర్ల వేంకటావధాని, మాడగుల వరప్రసాదరావు, ఆదిభట్ల నారాయణ దాసుగార్లు, తెన్నేటి విశ్వనాథం, లంక సుందరం, శొంఠి రామమూర్తిగార్ల రాక నాకు బాగా గుర్తు. గాంధీజీ కూడా వచ్చినట్లు చెప్తారు. ఎప్పుడూ పదిమందితో వచ్చే పోయే బంధువులు, స్నేహితులతో కళకళలాడేది మా ఇల్లు. అందుకే దాన్ని లోగిడి, భవంతి, దేవిడి కోర్టు ఇల్లు అనేవారు.

ఒకరోజు న్యాయస్థానం పనిమీద విశాఖ పట్నం నుంచి ఒక న్యాయవాది గారు వచ్చి భోజనం చేస్తూ, నన్ను ‘ఏం చదువుతున్నావు, ఏం చేస్తావు‘ అని అడిగి ‘నీ ఆనర్సుతో



చదువుమాని ఉద్యోగంలో ప్రవేశించడానికి గాను నీవు నన్ను విశాఖపట్నంలో కలుసుకో కాల్టెక్సు కంపెనీలో ఉద్యోగానికి సిఫారసు చేస్తా‘నన్నారు. ‘పరిశోధన చేయుటం నా ధ్యేయం మీ సలహా, సహాయం అవసరం లేద‘న్నాను అనుభవం లేనందున. దానికి మా నాన్న నాచే ఆ న్యాయవాదిగారికి

క్షమాపణ పదే పదే చెప్పించారు. అలాగే ఒకరోజు భోజనం చేస్తున్నప్పుడు, పెంపుడు పిల్లి, కూనతో సహా వచ్చి తొలుత మా నాన్న దగ్గరన్నం తిని, తరువాత నా దగ్గర కొచ్చింది. ఎంతకీ అన్నం పెట్టనందున నా కంచంలోంచి అన్నాన్ని లాగ ప్రయత్నిస్తే, ఎడమ చేత్తో గట్టిగా త్రోసాను. దాంతో మా నాన్న భోజనం మానేసి, చేయి కడుక్కున్నారు. 'నీవు చదువుకున్న మాట వాస్తవమే, కానీ నోరులేని పిల్లికి పట్టెడు మెతుకులు పడేయాలన్న భూతదయలేని వాడివని నిరసిస్తూ ఈ రోజు ఇలా చేసాన'న్నారు. నాటికీ నేటికీ నాకొక గుణపాఠం ఇది. ఇలా ఎన్నో ఉన్నాయి.



చెప్పుకో తగ్గ విశేషం 1985. మా నాన్నకి 83 సంవత్సరాలు, అమ్మకి 73 అంటే వేయి పూర్ణ చంద్రుల్ని చూసేరన్నమాట. దాన్ని పురస్కరించుకుని "సహస్ర చంద్రోదయం" మా తల్లిదండ్రులకు చేసాం. ఇది అయిదురోజుల పండగ. ఎక్కడెక్కడి బంధువర్గం, స్నేహితులూ విచ్చేశారు. మేం కెనడా నుంచీ, మరికొందరు అమెరికా నుంచీ వచ్చి ఘనంగా వేద ఘోషతో ఈ పండగని జరిపాము. ఆఖరిరోజు విందునకు, స్నేహితులు, న్యాయవాదులు, జడ్జీలు, మునసబులు, మేజిస్ట్రేటులు, పంచాయితీ సిబ్బంది విచ్చేశారు. ఉపన్యాసాలెన్నో జరిగాయి. వాటికి జవాబుగా మా నాన్న ఇలా అన్నారు. "మీరు ఆపాదించిన గుణగణాలు కలవారు వేరు. ఆ శాస్త్రిని నేను కాదనిన్నీ, మీరు వేసిన ఛార్జీలకు నేను నిర్దోషి నని విన్నవించుకుంటున్నా. నాకేమైనా విశిష్టత ఉంది అంటే అది నాకు విద్య నేర్పిన గురువులు. పెద్దలు పెట్టిన బిక్షే. వారికి నాటికి, నేటికీ కృతజ్ఞుడను. నా యందు మీ కందరికి దయ ఉండటం వలననే ఈ రోజు ఈ సదవకాశం, సద్భాగ్యం కలిగించారు. " ఇట్టి వినమ్రత నేడు కనుమరుగవుతున్నది. మా తరానికి ఈ నిరాడంబరత్వం ఆదర్శం, అనుసరణీయం.

సద్దు మణిగిన తర్వాత ఒక సాయంత్రం నేను మా నాన్న కచ్చేరి చావడిలో కూర్చున్నాం. రిక్షాలోంచి మా నాన్న స్నేహితులు శ్రీ మంథా సుందర రామారావుగారు - కవి, గాయకులు దిగారు. కాఫీ ఫలహారాలు పూర్తి చేసి, రామారావుగారు మా నాన్న స్వార్థ త్యాగి, పుణ్య స్వభావులని గుణ, గణ వర్ణన చేసి వారికి అత్యంత ప్రియమైన పాల్కురికి సోమన బసవ పురాణం నుంచీ పద్య పరంపరలు మాధుర్యంగా వినిపించారు. మా నాన్న తిక్కన, పోతన శ్రీనాథుని పద్యాల్ని చదివారు. మా అమ్మతో పాటు నేనూ విని చాలా ఆనందించాను. మా నాన్న కోరగా ఆది శంకరుల శ్లోకాలు కొన్ని చదివా. 'కాని మన తెలుగులో పద్యాలేమన్నా చదవమ'న్నారు. చిన్నతనంలో ఆయన పాదాల వద్ద చేరి నేర్చుకున్న గజేంద్ర మోక్షం, వామన చరిత్ర, దాశరధి శతకం నుంచి వల్లించాను.

తర్వాత ఓ రోజున ఇలా అన్నా. "నేను కెనడాలో కారు నడుపుతున్నపుడు, రోడ్డు మీద నల్లటి కోటు, తెల్లటి పాగా ధరించి ఎండలో నడుస్తున్న మీరు కండ్లకు కట్టినట్టు కనిపిస్తారు కదా. ఒక్కసారి మీరిద్దరూ ఆ దేశం వచ్చి మేం ఎలా ఉన్నామో చూడ్డానికి రండి అని మరలా కోరుతున్నాను." దానికి జవాబుగా "నీవు విదేశం వెళ్ళిపోయావు. నీ తమ్ముళ్ళ నెవ్వరినీ విదేశం తీసుకెళ్ళనని మాట ఇచ్చావు. వారందరూ కుటుంబాలతో ఇక్కడే ఉన్నారు. ఇల్లు, వాకిలి, పరివారాన్ని, స్నేహితులను, స్వదేశాన్ని విడిచి మేం రావటానికి బదులు, మీరే స్వదేశం వస్తే మంచిది. అదే మేలు, సమంజసం" అన్నారు. ఆ అరుదైన ఆత్మీయతా, నిరాడంబరతా, అల్ప సంతోషం, సత్య సంధత మరి ఎవ్వరిలోనూ నేను చూడలేదు; అందుకే మా నాన్నకి కృతజ్ఞతా పూర్వక వందనములు, వేల వేల జేజేలు, దివి నుంచీ వారి దీవెనలే మాకు శ్రీరామరక్ష. !!

శ్రీ సుబ్బారావు గారు 1935 లో అనకాపల్లిలో పుట్టారు. కాకినాడ పి. ఆర్. కాలేజీలో చదువుకున్నారు. ఆంధ్రా యూనివర్సిటీ, వాల్తేరు నుంచీ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఇండియా, ఆస్ట్రేలియా, కెనడా, అమెరికా, కువైట్ లలో biological oceanographer గా పనిచేస్తూ హిందూ, అట్లాంటిక్, పసిఫిక్, ఆర్కిటిక్ సముద్రాలపై విస్తృతంగా ప్రయాణించారు. ప్రస్తుతం Emeritus Scientist గా కెనడా లో స్థిరపడ్డారు. biological oceanography అనే అంశంపై దాదాపు 150 శాస్త్రీయ పరిశోధనా పత్రాలూ, 4 గ్రంధాలూ ప్రచురించారు. యునెస్కో సలహాదారుగా, President of CDC of IAPSO (Commission of Developing Countries, International Association of Physical Sciences of the Oceans) గా పనిచేశారు. ఆంధ్రాంగ్ల సాహిత్యాలు చదవడం, కర్ణాటక సంగీతం వినడం, గార్డెనింగ్ హాబీలు.

అమ్మ వొడిలో పెరిగిన బాల్యం, నాన్న వీపు మీద ఊరేగిన చిన్నతనం గుర్తుందా? మన చిన్నతనంలో అమ్మా, నాన్నా మనకి మొదటి గురువులు. మన వ్యక్తిత్వం రూపొందడంలో అమ్మా, నాన్నల పాత్ర మరువలేనిది.. మీ నాన్న గారి జ్ఞాపకాల్ని సుజనరంజని పాఠకులతో పంచుకోండి..చిన్నప్పుడు నాన్నగారు మిమ్మల్నెలా పెంచారు, ఎలా గారాబం చేశారు, ఎలా దండించారు, ఎలా పాఠాలు నేర్పించారు, ఎలా మిమ్మల్నో మనిషిగా తీర్చిదిద్దారు..అన్నీ రాయండి..

మీ నాన్నగారి ఫోటో కూడా కూడా జతచేయండి. మీ వివరాలు, ఫోటోలతో మీ రచనలు ఈ శీర్షికకి పంపించండి.